సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మోతుగూడెం పంచాయతీ పరిధిలో ఇంతూలూరు వాగు గ్రామం సమీపంలో ఆర్టీసీ బస్సు చెట్టును ఢీకొంది.

8లో



నీతి ఆయోగ్ సీఈవోకి స్వాగతం

డాబాగార్డెన్స్: విశాఖ వచ్చిన నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్వాగతం పలికారు.



ఏజెన్సీ పంటల్లో పోషక విలువలు

ఏజెన్సీలో సాగుచేస్తున్న పంటల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని రైతుసాధికార సంస్థ జిల్లా మేనేజర్ భాస్కరరావు తెలిపారు.

8లో

న్యూస్‌రీల్

ప్రమాదస్థాయికి డుడుమ జలాశయం నీటిమట్టం



డుడుమ నుంచి బలిమెలకు విడుదల చేస్తున్న నీరు

ముంచంగిపుట్టు: ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన డుడుమ జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరింది. కొన్నిరోజులుగా సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భారీగా వరదనీరు జలాశయంలో చేరింది. డుడుమ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 2,590 అడుగులు కాగా, మంగళవారం నాటికి 2589.7 అడుగులకు చేరింది. అప్రమత్తమైన జలాశయం సిబ్బంది ఒకటో నంబర్ గేటును ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని బలిమెల రిజర్వాయర్‌కు విడుదల చేశారు. వర్షాలు జోరుగా కురుస్తుండడంతో నీటిమట్టం పర్యవేక్షిస్తూ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వృత్తి నైపుణ్య శిక్షణ అందించడానికి తాము ప్రభుత్వానికి ప్రతిపాదనాలు పంపిస్తున్నామని చెప్పారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాలకు చెందిన నిరుద్యోగ యువత సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో ఈనెల 20 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. టైలరింగ్, నిర్మాణ రంగం, పర్యాటకం, ఆతిథ్య రంగం, ప్లంబింగ్, ఫుడ్‌ప్రోసెసింగ్, ఆటోమోటివ్, సెక్యూరిటీ గార్డు, తాపీ పనిలో ఆసక్తి మేరకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రధానంగా జీకే వీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, డుంబ్రిగుడ మండలాలకు చెందిన మారుమూల గ్రామాల్లో గిరిజన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టేకు ప్లాంటేషన్ రక్షణకు చర్యలు

- డీఎఫ్‌వో సూర్యనారాయణపడాల్



టేకు చెట్ల కొలతలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

గూడెంకొత్తవీధి: టేకుప్లాంటేషన్ రక్షణకు చర్య లు తీసుకుంటున్నామని చింతపల్లి డీఎఫ్‌వో సీహెచ్. సూర్యనారాయణ పడాల్ చెప్పారు. అటవీ సిబ్బంది నిత్యం నిఘా ఉంచుతున్నారని తెలిపారు. చింతపల్లి, ఆర్వీనగర్ బీట్లలో మలిగూడ టేకు ప్లాంటేషన్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. చెట్ల సైజ్‌ను కొలత వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ పరిధిలో ఉన్న టేకు చెట్లకు పటిష్ట భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. స్ట్రైకింగ్ ఫోర్సుతో పాటు బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఆయన వెంట రేంజర్ కె.శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌వో చిరంజీవి,ఎఫ్‌బీవో ఈశ్వరరావు,బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

15న పునరావాస కాలనీల స్థలాల సందర్శన

చింతూరు: మండల కేంద్రం చింతూరుకు చెందిన గిరిజనేతర నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్‌ఆదిత్య ఆదేశాల మేరకు గిరిజనేతర నిర్వాసితులు ఈనెల 15న పునరావాస కాలనీ స్థలాల సందర్శించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చింతూరు ఆర్అండ్ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమణ మంగళవారం తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను రెండు బస్సుల్లో తీసుకువెళ్లి ఏలూరు జిల్లా తాడువాయి, తూర్పు గోదావరి జిల్లా యాదవోలులో స్థలాలను చూపించనున్నట్టు ఆయన తెలిపారు. రెండు స్థలాలు పరిశీలించిన పిమ్మట నిర్వాసితుల అభీష్టం మేరకు వారు కోరుకున్న ప్రాంతంలో పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు



జి.మాడుగుల మండలం మద్దిగరువు వద్ద వర్షానికి కొట్టుకుపోయిన బ్రిడ్జి

- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు
- మారుమూల గ్రామాలకు నిలిచిన రాకపోకలు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుండపోత వానతో మారుమూల ప్రాంతాల్లోని గెడ్డలు, కొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గెడ్డల అవతల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముంచంగిపుట్టు, పెదబయలు, డుంబ్రిగుడ, జి.మాడుగుల, చింతపల్లి, పాడేరు మండలాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉండడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. జిల్లాలో 312.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉధృతంగా కొండ వాగులు, గెడ్డలు

భారీగా వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని పలు ప్రధాన గెడ్డలు, వాగులు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లోని గెడ్డల్లో వరద ప్రవాహం ప్రమాదకరంగా ఉండడంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముంచంగిపుట్టు మండలంలోని లక్ష్మీపురం-బుంగాపుట్టు రోడ్డులో సుత్తిగెడ్డ వరద ఉధృతితో రెండు రోజుల నుంచి ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలోని ప్రధాన మత్స్యగెడ్డలో నీటి ప్రవాహం అధికంగా ఉంది. మత్స్యగుండంలో భక్తుల సందర్శనను నిలిపివేశారు. హుకుంపేట మండలంలోని రాళ్లగెడ్డ, దిగుడుపుట్టు గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. హుకుంపేట నుంచి అరకు వెళ్లే రోడ్డులో మాసాడ కల్వర్టు మీదుగా వరదనీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. డుంబ్రిగుడ మండలంలోని చాపరాయిగెడ్డ, అరమ ప్రాంతంలోని నరింగ్‌జోడి గెడ్డలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. నరింగ్‌జోడి గెడ్డ ఉధృతితో జోడిమామిడి గ్రామంలో ఖరీఫ్ వరినాట్లు కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని పంట భూములు వరద ముంపునకు గురయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ అప్రమత్తం చేశారు.

వర్షపాతం వివరాలు

జిల్లాలో 312.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టు మండలంలో అత్యధికంగా 85.8 మిల్లీమీటర్లు, పెదబయలులో 52.8, చింతూరు 33.4, డుంబ్రిగుడ 26.2, గంగవరం 26, మారేడుమిల్లి 16.4, అరకులోయ 12.6, వై.రామవరం 10.8, అడ్డతీగల 9.6, అనంతగిరి 9.2, జి.మాడుగుల 4.4, కూనవరం 4, రంపచోడవరం 4, హుకుంపేట 3.2, చింతపల్లి 2.4, కొయ్యూరు 2.4, ఎటపాక 2.8, జీకే వీధి 2.2, వి.ఆర్.పురం 1.8, రాజవొమ్మంగి 1.0, పాడేరు 0.8, దేవీపట్నంలో 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కొట్టుకుపోయిన వంతెన

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామం వద్ద వంతెన కొట్టుకుపోయింది.దీంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సంతబయలు గ్రామంలో వారపుసంత వర్షపు కారణంగా అంతంత మాత్రంగా జరిగింది. కొడిమామిడి గెడ్డ, సంఘంగెడ్డ, మత్స్యగెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. గెడ్డల సమీపంలో గల పంట పొలాలు నీటి మునిగాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న డుంబ్రిగుడ మండలంలోని నరింగ్‌జోడి గెడ్డ

విరిగిపడిన చెట్లు

మోతుగూడెం: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో తులసిపాకలు-మోతుగూడెం రోడ్డుపై నీరు ప్రవహించింది. పొల్లూరు వద్ద వాగు ఉధృతంగా ప్రవాహిస్తోంది. మోతుగూడెంలోని ఏపీ జెన్‌కో నివాస కాలనీల్లోని రోడ్డులపై వర్షం నీరు చేరింది. మోతుగూడెం వెళ్లే రహదారిలో చెట్లు విరిగిపడ్డాయి.

కోతకు గురైన కల్వర్టు

ముంచంగిపుట్టు: మండలంలోగల వనగుమ్మ పంచాయతీ కేంద్రం నుంచి అసరాడ మార్గమధ్యలోగల కల్వర్టు వరద కోతకు గురైంది. రంగబయలు, వనగుమ్మ పంచాయతీల్లో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి వెంటనే కల్వర్టు నిర్మాణం చేపట్టి, రాకపోకలకు పునరుద్ధరించాలని, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్కీ అధికారులను కోరారు. లక్ష్మీపురం కర్రలపోదర్ వాగు ఉధృతంగా ప్రవహించడంతో లక్ష్మీపురం, బూంగపుట్టు పంచాయతీల్లో పలు గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి.



డుంబ్రిగుడ మండలం జోడుమామిడిలో నీట మునిగిన పంట



మోతుగూడెం వెళ్లే రహదారిలో విరిగిపడిన చెట్టు



వనగుమ్మ వద్ద కోతకు గురైన కల్వర్టు

గంజాయి సాగు చేస్తే క్రిమినల్ కేసులు

ముంచంగిపుట్టు: గంజాయి సాగుచేస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని ఎస్పీ తుహిన్‌సిన్హా హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, అధికంగా నమోదవుతున్న కేసుల వివరాలపై ఆరా తీశారు. సరిహద్దు ప్రాంతంలోని పరిస్థితిపై స్థానిక ఎస్ఐ రవీంద్రను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయిసాగు, రవాణా చేస్తూ యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, యువత ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితాల్లో స్థిరపడాలని తెలిపారు.



ముంచంగిపుట్టు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): భద్రతా కారణాల వల్ల కొత్తవలస-కిరండూల్‌లైన్‌లో నడిచే పలురైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదించడంతోపాటు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్ (18514)నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 18వతేదీ వరకు దంతేవాడవరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలోకిరండూల్-విశాఖ(18513)నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల19వతేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల19వ తేదీ వరకు దంతేవాడవరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ (08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈ నెల 20వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

మర్యాదతో మరింత ఆదరణ

- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సెలింగ్
- వారంలో ఒక రోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహణ
- ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల చర్యలు



కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై ఆర్టీసీ అధికారులు ఫోకస్ పెడుతున్నారు. పాసింజర్ల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి పట్ల కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంభోదిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, దురుసుగా సమాధానం చెబుతున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు ఆర్టీసీ కంప్లయింట్ సెల్‌కు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం కంప్లయింట్ సెల్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీసీ జోన్-1కు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈ కండక్టర్లు, డ్రైవర్లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటల చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి నిపుణులు, లెక్చరర్లు, అడ్వకేట్లను కూడా రప్పించి వారితో సుహృద్భావ వాతావరణంలో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాట తీరు గౌరవప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంభోదించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల వ్యవహారశైలి ప్రయాణికులపై ప్రభావం చూపుతుందన్న భావనకు అధికార్లు వచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా వీరు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, ప్రైవేటు ఆపరేటర్ల వైపు మళ్లే అవకాశం ఉండదని వీరు భావిస్తున్నారు.

నిరంతరం కొనసాగిస్తాం...



ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించడం వల్ల ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. దీంతో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో పెరిగి ఆర్టీసీ ఆదాయం వృద్ధి చెందడానికి కూడా దోహదపడుతుంది. కంప్లయింట్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత సిబ్బందికి బ్యాచ్‌కు 10-15 మంది చొప్పున ఎంపిక చేసి నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. దీనిని నిరంతరం కొనసాగిస్తాం.

– సి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్-1

తప్పు చేస్తే శిక్ష తప్పదనే భయం ఉండాలి

- వివక్షను రూపుమాపేందుకే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం
- ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు

సీతమ్మధార(విశాఖ): సమాజంలో నెలకొన్న వివక్షతను రూపుమాపడానికి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకొచ్చిందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు అన్నారు. విశాఖ నగరంలోని సీతమ్మధారలోని ఓ కల్యాణ మండపంలో ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ సెల్, సీబీడీ సంయుక్తంగా 'ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు, వారిపై జరుగుతున్న దాడులు, నివారణ' అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించాయి. డీఎల్ఎస్‌సీ చైర్‌పర్సన్, జడ్జి ఎం.వి. శేషమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం స్ఫూర్తితో చట్టాలను అమలు చేయాలన్నారు.

బలహీన వర్గాలు ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితుల హక్కులను వివరించారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులను కల్పించిందన్నారు. బలహీన వర్గాల వారు తమని తాము రక్షించుకోవడం కోసం ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. సమాజంలో అన్ని వర్గాల మనుషులు ఉంటారని.. తప్పు చేస్తే శిక్ష తప్పదనే భయం నెలకొన్నప్పుడు వివక్షతకు తావుండదన్నారు. ఆ దిశగా న్యాయవాదులు, పోలీసులు, ఇతర శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.ఎస్పీ(మంగళగిరి) అనీల్ కుమార్ మాట్లాడుతూ విచారణ అధికారి పారదర్శకంగా వ్యవహరించినప్పుడు బాధితులకు సరైన న్యాయం దక్కుతుందన్నారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. సీబీడీ రీజినల్ అధికారి పి.వి.ఆర్.ఎస్.ఎస్.ఎం.వి.ఆర్ వర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో డీఎస్పీ ఎన్. భూపాల్, ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ బి.వి.రమణమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సభ్యులు పి.మల్లేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ ఏసీపీ ఎస్.బాపూజీ, గణపతి వాసవ్య మహిళా సంఘం ప్రతినిధి ఆర్.మాధవి గణపతి, ఎన్బీఎం లా కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



గోరమామిడిలో రహదారికి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు

- ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు
- పలు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మారేడుమిల్లి : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ బాబు తెలిపారు. మంగళవారం వారు మండలంలో పలు గ్రామాల్లోని రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. మద్దివీడు నుంచి వేటుకూరు వరకు రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నాలుగు కిలోమీటర్ల రోడ్డుకు, నీలవరం నుంచి గాలిగోపురం వరకు రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మూడు కిలో మీటర్ల రోడ్డు, కేవీ లంక నుంచి టేకులవీధి వరకు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న రహదారి, గోరమామిడి నుంచి తాడేపల్లి వరకు రూ.1.15 కోట్ల వ్యయంతో చేపట్టిన మూడు కిలో మీటర్ల రోడ్డు, సున్నంపాడు నుంచి నూరుపూడి వరకు రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఐదు కిలోమీటర్ల రహదారి, కుండాడ నుంచి జీఎం వలస వరకు రూ.1.35 కోట్ల వ్యయంతో మూడు కిలో మీటర్ల రోడ్డు, వేటుకూరు నుంచి దేవుడు లంక వరకు రూ.65 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు కిలోమీటర్ల రహదారికి శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు.

83 మందికి కొత్త పింఛన్ల పంపిణీ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. మంగళవారం మారేడుమిల్లి సచివాలయం వద్ద నిర్వహించిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మండలంలోని 83 మందికి పార్టీ నాయకులతో కలిసి వారు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పింఛన్ మంజూరు కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామం దాటకుండనే పింఛన్ మంజూరు చేసి, ఇంటికే వచ్చి ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, మండల కో-ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, సర్పంచ్‌లు కొండా జాకబ్, కుండ్ల ప్రభాకర్ రెడ్డి, వైస్ సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బొడ్డేటి గంగరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ గొర్లె అనిల్‌ప్రసాద్, మండల ఇన్‌చార్జి ప్రేమ్ కుమార్, నాయకులు దూడ స్మిత్, సునీల్ కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.



కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

శిబిరం చిరునామా
కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం
వంజంగి హిల్స్ రోడ్డు, పాడేరు
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన
ఫోన్ నంబర్లు :
94915 53782, 70757 09205

క్లుప్తంగా

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

చింతపల్లి: మండలంలోని కుడుమసారి వాగులో మంగళవారం గుర్తుతెలియని మహిళ మృత దేహం లభ్యమైనట్టు అన్నవరం ఎస్‌ఐ రమణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

సారాతో ముగ్గురి అరెస్టు



సారాతో పట్టుబడిన నిందితులు

గూడెంకొత్తవీధి: వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురిని అరెస్టు చేసి, 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ అప్పలసూరి బుధవారం తెలిపారు. పెదవలస జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరిని పట్టుకుని వారి వద్ద నుంచి పదిలీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. పెదవలసకు చెందిన సాగిన చలపతిరావు,మాడుగుల శ్యామ్యుల్‌ను అరెస్టు చేశామన్నారు. దేవరాపల్లి చిలకవీధికి చెందిన కొర్రా శుభలక్ష్మి నుంచి దేవరాపల్లి సమీపంలో ఐదు లీటరల సారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కొల్లాం రైలుకు డివైన్ నగర్‌లో తాత్కాలిక హాల్ట్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–కొల్లాం–విశాఖపట్నం వీక్లీ రైలుకు ఆయా తేదీల నుంచి డివైన్ నగర్‌లో ఒక నిమిషం తాత్కాలిక హాల్ట్‌ను కల్పిస్తున్నట్లు త్రిపాఠి తెలిపారు. అక్టోబరు 12వ తేదీ నుంచి విశాఖపట్నం–కొల్లాం (18567) వీక్లీ స్పెషల్ రైలు డివైన్ నగర్‌లో ఆగుతుంది. ఈ రైలు మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు డివైన్ నగర్ చేరుకుని, అక్కడ నుంచి 8.16గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో అక్టోబరు 20వ తేదీ నుంచి కొల్లాం–విశాఖపట్నం (18568) ఎక్స్‌ప్రెస్‌కు డివైన్ నగర్‌లో హాల్ట్ కల్పించారు. ఈ రైలు అదే రోజు రాత్రి 11.45 గంటలకు డివైన్ నగర్ చేరుకుని, అక్కడ నుంచి 11.46 గంలకు బయల్దేరుతుంది.

జైళ్ల సంస్కరణలు భేష్

- ముగిసిన జైళ్ల శాఖ జాతీయ సదస్సు
- ఆరు అంశాలపై సుదీర్ఘంగా సాగిన చర్చ



పుస్తకం ఆవిష్కరిస్తున్న గవర్నర్



సిబ్బంది నుంచి వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఆరిలోవ: రుషికొండలోని సాయిప్రియ రిసార్ట్స్‌లో రెండు రోజులుగా జరుగుతున్న జైళ్ల శాఖ 8వ జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. సదస్సులో భాగంగా స్వాతంత్ర్యం రాకముందు దేశంలో జైళ్ల పరిస్థితి, పనితీరు.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ 76 ఏళ్లలో ఎలాంటి సంస్కరణలు జరిగాయి.. భవిష్యత్‌లో ఇంకెలాంటి సంస్కరణలు అమలు చేయాలి, ఏ విధంగా జైళ్లను ఆధునికీకరించాలి తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(బీపీఆర్‌డీ), రాష్ట్ర జైళ్ల శాఖ సంయుక్తంగా 'అమృత్ కాల్'పేరుతో నిర్వహించిన ఈ సదస్సును సోమవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా ప్రారంభించిన విషయం తెలిసిందే. ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితతో కలిసి రాష్ట్ర జైళ్ల శాఖ ముద్రించిన బులిటెన్‌ను ఆవిష్కరించారు. బీపీఆర్‌డీ డీజీ బాలాజీ శ్రీ వాత్సవ్, ఏపీ డీజీ హరీష్ కుమార్ గుప్తా, ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జైళ్ల శాఖ డీజీలు, ఐజీలు, కేంద్ర కారాగారాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఆరు అంశాలపై సుదీర్ఘ చర్చ

సదస్సులో భాగంగా జైళ్లలో సంస్కరణలు, సంక్షేమం, అభివృద్ధి, ఆధునీకీకరణ, ఖైదీల్లో పరివర్తనం కలిగించడం, వారితో స్నేహంగా మెలగడం, కౌన్సెలింగ్ తదితర అంశాలపై ప్రధాన వక్తలు మాట్లాడారు. అనంతరం అధికారులతో గ్రూపులను ఏర్పాటు చేసి.. ఆయా రాష్ట్రాల జైళ్లలో అమలు చేస్తున్న సంస్కరణలు, సంక్షేమం అభివృద్ధిపై చర్చించారు. రెండు రోజుల సదస్సులో ప్రధానంగా ఆరు అంశాలపై చర్చ జరిగింది. టెక్నాలజీ ఇన్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్, స్టేటస్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఇన్ ప్రిజన్స్ ఇన్ ఇండియా, మోడల్ ప్రిజన్స్ లెజిస్లేషన్, డీ అడిషన్ ఆఫ్ ప్రిజనర్స్, ఓవర్ ప్రిజన్స్, అల్టర్నేటివ్స్ టు ఇన్‌కార్సెరేషన్ అనే ఆరు అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. చర్చించిన అంశాలతో రాష్ట్ర జైళ్ల అధికారులు ఓ నివేదిక సిద్ధం చేసి, బీపీఆర్‌డీతో పాటు అన్ని రాష్ట్రాల జైళ్ల శాఖ అధికారులకు సమర్పిస్తారు.

ఆకర్షణగా ఖైదీల ఉత్పత్తులు

రాష్ట్రంలోని జైళ్లతో పాటు తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల జైళ్లలో ఖైదీలు తయారు చేసిన పలు వస్తువులను ఇక్కడ ప్రదర్శించారు. ఈ ఉత్పత్తులను అధికారులు పరిశీలించారు. ఉత్తరాఖండ్ జైలులో ఖైదీలు తయారు చేసిన రూ.1,100 విలువ గల దుప్పి పెయింటింగ్, ఉత్తరప్రదేశ్ జైలులో ఖైదీలు రూపొందించిన రూ.900 విలువ గల కుక్క కార్పెట్ అధికారులను ఆకట్టుకుంది. దుస్తులు, చెక్క బొమ్మలు, కార్పెట్లు, ఫినాయిల్ తదితర వస్తువులను ఇక్కడ ప్రదర్శించారు.

సదస్సులో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ దేశంలో జైళ్ల సంస్కరణలు బాగున్నాయన్నారు. సంస్కరణలు అమలు చేయడం, ఖైదీలకు ఆరోగ్యశ్రీ పథకం అమలు, జైళ్ల ఆధునికీకరణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఖైదీలకు ప్రతీకారంతో కూడిన శిక్ష ఉండకూడదన్నారు. వారిలో పరివర్తనం తీసుకొచ్చేలా జైళ్ల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర హోం మంత్రి వనిత మాట్లాడుతూ రాష్ట్రంలోని జైళ్లలో పటిష్టమైన భద్రత ఉందన్నారు. సంస్కరణలు అమలు చేయడంతో పాటు ఖైదీలు, సిబ్బంది కోసం అనేక సంక్షేమ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

15లోగా ఓటరు దరఖాస్తుల డిజిటలైజేషన్ పూర్తి

ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్: అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొత్త ఓటర్ల దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. కొత్తగా 4,272 మంది దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయం నుంచి నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల ఏఈఆర్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6,838 మంది ఓటర్లు మృతి చెందారని, సంబంధిత ఫారమ్‌లను ప్రాజెక్టు అధికారి లాగిన్‌కు పంపించాలన్నారు. వారి పేర్లను తొలగించే ప్రక్రియ త్వరితిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారం–6,7,8లను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 6,891 మంది ఓటర్లకు మార్పులు, చేర్పులు చేయాల్సి ఉందని చెప్పారు. ఇప్పటి వరకు 59 శాతం చేర్పులు, మార్పులు చేశారని మిగిలిన 41 శాతం కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలను ఏఈఆర్‌వోలకు ఆయన వివరించారు.

వలిసెల సాగుపై ప్రత్యేక దృష్టి



విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీహరిరావు

చింతపల్లిరూరల్: రైతులు వలిసెల సాగుపై ప్రత్యేక దృష్టి సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీహరిరావు అన్నారు. మండలంలో మంగళవారం సోమరవీధిలో నాలుగు గ్రామాలకు చెందిన రైతులు 60 మందికి మేలి జాతికి చెందిన (ఉత్కల్ నైజర్150) రకం విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలస్య ఖరీఫ్ పంటగా రైతులు వలిసెల పంటను సాగు చేస్తున్నారన్నారు.వలిసెల సాగులో అధిక దిగుబడి వచ్చేలా పలు సూచనలిచ్చారు. అందులో ముఖ్యంగా వలిసెల పంటలో ప్రధాన కలుపు మొక్క బంగారు తీగ సమస్య వల్ల రైతులు కొంత కాలంగా సాగుకు దూరమయ్యారన్నారు. దీని వల్ల దిగుబడి తగ్గిపోతుందన్నారు. దీన్ని అధిగమించడానికి విత్తనాలు ఉప్పు ద్రావణంలో నానబెట్టి వలిసెలు, బంగారు తీగ విత్తనాలు వేరు చేయాలన్నారు. అప్పటికి బంగారుతీగ ఉధృతి పంటలో అధికంగా ఉంటే శాస్త్రవేత్తలు సూచించిన మందులను పిచికారీ చేయాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త దివ్యసుధ, డాక్టర్ ప్రసాదరావు, రైతు కరుణనిధి పాల్గొన్నారు.

ఏజెన్సీ పంటల్లో పోషక విలువలు

- చిరుధాన్యాలను వినియోగించుకోవాలి
- రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ భాస్కరరావు

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాలలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, ఆదివాసీలంతా వాటినే తిని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని రైతుసాధికార సంస్థ జిల్లా మేనేజర్ భాస్కరరావు సూచించారు. ఇరడాపల్లి పంచాయతీ తురాయి మెట్టలో మంగళవారం రైతుసాధికారిక సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు ఆహారం–పోషణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద మొత్తంలో ఆహార, చిరుధాన్యాల పంటలను గిరిజన రైతులు సాగుచేస్తున్నప్పటికీ వాటిని వినియోగించకుండా పూర్తిగా విక్రయించేస్తున్నారని, ఈ పరిస్థితిలో మార్పు రావాలన్నారు. పంటలను తిండి అవసరాలకు ఉంచుకున్న తరువాతే విక్రయించాలన్నారు.హెల్త్ అండ్ న్యూట్రీషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజగోపాల్ మాట్లాడుతూ గిరిజనులు పూర్వం నుంచి వస్తున్న ఆహారపు అలవాట్లను కొనసాగించాలని తెలిపారు. టిమాటిక్ లీడ్ రాము మాట్లాడుతూ పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగానికి గిరిజన రైతులు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం మహిళలకు పోషక ఆహార సామగ్రి కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు రజిత, సుధాకర్,నాగమణి, భారతి, మోదకొండమ్మ, లక్ష్మి, సోములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు రైతు మృతి



అప్పలనాయుడు(ఫైల్)

రాంబిల్లి : కట్టుబోలు గ్రామానికి చెందిన రైతు పాము కాటుకు మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున జల్లా అప్పలనాయుడు(61) ఇంటి నుంచి మురకాడ సమీపంలో వున్న పొలంలోకి వెళ్తుండగా పాము కాటు వేసింది. యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రైతుగా, కూలీగా , భవన నిర్మాణ కార్మికుడిగా, కళాకారుడిగా గ్రామంలో అప్పలనాయుడుకు మంచి పేరుంది. అప్పలనాయుడు మృతితో ఆయా కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్‌ఐ దీనబంధు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అప్పలనాయుడుకు భార్య గణేషమ్మ, కుమారులు సాయి, భాను ఉన్నారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది.

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం..!

- డీవీఈవో సుజాత
- హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాంపై
- కళాశాలల ప్రిన్సిపాళ్లకు అవగాహన



కళాశాలల ప్రిన్సిపాళ్లకు హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాం గురించి వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

అనకాపల్లి రూరల్ : నేటి యువత ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలే లక్ష్యంగా విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు కేవలం ఇంటర్మీడియట్ అర్హతతోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందేలా రాష్ట్ర ప్రభుత్వం అద్భుత అవకాశం కల్పించేందుకు కార్యాచరణ రూపొందించింది. భారతదేశపు అతిపెద్ద ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్‌తో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలను అందిస్తోంది ప్రభుత్వం. హెచ్‌సీఎల్ టెక్ బీ పేరుతో అమలు చేస్తున్న ఈ అసాధారణ కార్యక్రమంపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఇందులో భాగంగా మంగళవారం అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశాన్ని జిల్లా వృత్తి విద్యాధికారిణి బి. సుజాత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇలాంటి మంచి అవకాశంపై విద్యార్థులందరికీ కళాశాలల ప్రిన్సిపాళ్లు వివరించి అవగాహన కల్పించాలన్నారు. చిన్న వయసులోనే సాఫ్ట్‌వేర్ కొలువులతో పాటుగా ఉన్నత విద్య చదువుకునే వీలుంటుందన్నారు. దీనిని విద్యార్థులంతా సద్వినియోగపర్చుకునేలా చూడాలని ప్రిన్సిపాళ్లను ఆమె కోరారు. హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాం గురించి సంస్థ రాష్ట్ర మేనేజర్ అనిల్, ఉత్తరాంధ్ర క్లస్టర్ మేనేజర్ యుగేష్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. 2023, 2024 సవత్సరాల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు హెచ్‌సీఎల్ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాంకు అర్హులని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఎంపిక ప్రక్రియ ఉంటుంది. తొలుత నిర్వహించే ఆన్‌లైన్‌లో పరీక్షలో ఎంపికైన వారికి హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఎంపికైన విద్యార్థులు హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాంలో చేరడానికి ఆఫర్ లెటర్ పొందుతారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆ తర్వాత ఏడాది కాలపరిమితితో టెక్ బీ ట్రైనింగ్ ఉంటుంది. విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరుల్లో హెచ్‌సీఎల్ క్యాంపస్‌లకు వెళ్లి ఒక నెల శిక్షణ తీసుకోవాలి. అనంతరం మరో ఐదు నెలలు ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ శిక్షణ పొందవచ్చు. ఇందుకోసం అభ్యర్థులకు ల్యాప్‌ట్యాప్‌తో పాటు ఇంటర్‌నెట్ ఛార్జీలు సంస్థ ఇస్తుంది. అనంతరం ప్రారంభంలోనే రూ.10 వేల స్టైఫండు ఆరు నెలలు చెల్లిస్తారు. తర్వాత ప్రతిభా ఆధారంగా సాఫ్ట్‌వేర్‌తో పాటు ఇతర రంగాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని వారు తెలిపారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాల కోసం తమ సంస్థ దేశంలో ప్రముఖ విశ్వవిద్యాలయాలు, ఐఐటీ, ఐఐఎంలతో ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ జయబాబు, జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

15న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. టెక్నోసాఫ్ట్ సొల్యూషన్స్, వోల్టా ప్యాషన్స్, ఏడీఎల్ ఆగ్రో ఫార్మ్, శ్రీరామ్ ఫైనాన్స్, రిలయన్స్ జియో, వరుణ్ మోటర్స్, టీం లీజ్, యూనియన్ బ్యాంక్, రెడ్డీస్ లేబరేటరీస్, బిగ్‌బాస్కెట్, సెవెన్ హిల్స్ హెల్త్ కేర్ తదితర కంపెనీల్లో 873 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. అసోసియేట్ ఏజెన్సీ, సూయింగ్ మిషన్ ఆపరేటర్, బిల్లింగ్, కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మాసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, టీం లీడర్స్, స్టాఫ్ నర్స్, ఇన్‌చార్జి నర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, పీజీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న 18–35 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు https:// www.ncs.gov.in/లో పేర్లు నమోదు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు.

వాతావరణంలో మార్పులపై అవగాహన

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పట్టణ వాతావరణంలో కలిగే మార్పులపై అవగాహన సదస్సు జరిగింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సూచనల మేరకు జీవీఎంసీ, ఎస్ఆర్‌యూ, ఎన్ఐయూఏ సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ ఎంపిక చేసిన నగరాల్లో కొచ్చి, భువనేశ్వర్, సూరత్, పుణె, విశాఖపట్నం ఉందన్నారు. ప్రాథమిక దశ నుంచే వాతావరణ ప్రభావంపై విద్యార్థులకు బోధించడం, సముద్ర తీర ప్రాంతంలోని మత్స్యకారులు, నగర ప్రజలకు అవగాహన కల్పించాలని తీర్మానించారు. ఏయూ అధ్యాపకులు, ఎన్జీవోస్, ఇండియన్ మెట్రాజికల్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని పలు అంశాలు చర్చించారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు



ఇంతులూరు వాగు సమీపంలో ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు



గాయపడిన ప్రయాణికుడు

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధిలో ఇంతూలూరు వాగు గ్రామం సమీపంలో మంగళవారం తెల్లవారు జామున 5గంటల సమయంలో విశాఖపట్నం డిపోకు చెందిన బస్సు చెట్టును ఢీకొని బోల్తా పడింది. భద్రాచలం వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ సమయంలో బస్సులో ఉన్న 12 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని డొంకరాయి ఏపీ జెన్‌కో ఆస్పత్రికి తరలించ, చికిత్స చేశారు. ప్రమాదం తెల్లవారు జామున 5.10 నిమిషాల సమయంలో జరిగింది.

ఏయూలో యానిమల్ హౌస్ ఏర్పాటు



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ పరిశోధనలకు ఉపయుక్తంగా యానిమల్ హౌస్ ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌కి చెందిన రొడెంటా బయో సర్వ్ సంస్థ ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో మంగళవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, రొడెంట సంస్థ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ కె.ఆనంద్ కుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. వర్సిటీలో ఫార్మసీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, జువాలజీతో పాటు జీవశాస్త్ర కోర్సులు అభ్యసించే పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఉపయుక్తంగా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఏయూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలిమెంట్ భవనానికి అనుసంధానంగా.. నెల రోజుల్లో ఈ కేంద్రం పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభించనుంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీల్లో ఇటువంటి కేంద్రం ఉండటం అరుదైన విషయమని, రెండు దశల్లో దీనిని విస్తరిస్తామన్నారు. డాక్టర్ కె.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ నగరంలోని వివిధ పరిశ్రమల అవసరాలు తీర్చుతూ ఆదాయ వనరుగా ఈ కేంద్రం నిలుస్తుందన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, డీన్ ఆచార్య కె.బసవయ్య, ఆచార్య ఈశ్వర కుమార్, గిరిజా శంకర్, శైలజ, మురళీకృష్ణ కుమార్ పాల్గొన్నారు.

మది దోచే మంచు సోయగం




పాడేరు ఘాట్‌లో పొగ మంచు



పాడేరుకు సమీపంలోని వంజంగి కొండలను తాకిన మేఘాలు

సాక్షి, పాడేరు: మన్యంలో ప్రకృతి రమణీయత చూపరులను కనువిందు చేస్తుంది. విభిన్న వాతావరణంతో అలరించే మన్యంలో ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు అధికంగా తరలివస్తుంటారు. మంగళవారం ఉదయం 8గంటల వరకు పాడేరు ఘాట్‌రోడ్డులో పొగమంచు దట్టంగా కురిసింది. పాడేరు చుట్టూ ఉన్న కొండలను మేఘాలు తాకాయి. వంజంగి కొండలు మరింత కనువిందు చేశాయి.

అమెరికాలో వేంకటేశ్వర శతకం పుస్తకావిష్కరణ



అమెరికాలో వేంకటేశ్వర శతక పుస్తకాని ఆవిష్కరిస్తున్న శిష్టా తమ్మిరాజు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లికి చెందిన ప్రముఖ కవి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శిష్టా తమ్మిరాజు రచించిన దాస తమ్మిరాజులు దండ మిదియె అను వేంకటేశ్వర స్వామివారి శతక కావ్యం అమెరికా ఫ్లోరిడా రాజధాని తలహాస్సీ నగరంలో ఈనెల 10న ఆవిష్కరించారు. ప్రముఖకవి, సంగీత దర్శకుడు శ్రీనివాస భరద్వాజ్ కిశోర్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ శతకకర్త అద్భుతమైన చక్కని పద్యాలు రచించడమే కాకుండా ఈ నగరంలో నూతనంగా నిర్మింపబడిన వేంకటేశ్వరస్వామి వారికి అంకితమివ్వడంతో ఇక్కడ నివసిస్తున్న తెలుగువారంతా ఎంతో ఆనందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రముఖ గాయని నోరి రాధిక మాట్లాడుతూ తన చక్కని గానంతో పద్యాలు వీనులవిందుగా ఆలపించగా ప్రముఖ పండితురాలు డా.సుమన ఆ పద్యాలను సమీక్ష చేస్తూ పద్యాలు సరళంగా సుభోదకంగా ఉన్నాయని ప్రశంసించారు. పద్యకవి జానపద రవి మాట్లాడుతూ ఇది ప్రతి ఇంట భక్తి భావాన్ని కురిపించే పుస్తకమన్నారు.